క్లుప్తంగా

డీ పట్టా భూముల వివరాలను అందించండి

మాకవరపాలెం : డీ పట్టా భూముల వివరాలను త్వరితగతిన అందించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులతో పాటు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో ఉన్న డీ పట్టా భూముల వివరాలను మూడు రోజుల్లో సర్వే చేసి తనకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ సోమశేఖర్, ఆర్ఐ జెట్టి పాల్గొన్నారు.

వర్తక సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు


వనభోజనాలు చేస్తున్న వర్తక సంఘం సభ్యులు

గొలుగొండ : కృష్ణదేవిపేట గ్రామంలో ఉన్న అల్లూరి సీతారామరాజు వర్తక సంఘం ఆధ్వర్యంలో గాదిగుమ్మ జలపాతం వద్ద మంగళవారం వన భోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్ఐ తారకేశ్వర్రావు మాట్లాడుతూ వర్తక సంఘం సభ్యులు ఐక్యంగా ఇటువంటి వన భోజనాలు కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అలాగే వ్యాపారులు షాపుల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని, కొత్త వ్యక్తులపై నిఘా ఉంచుకోవాలని తెలిపారు. షాపులు మూసే సమయంలో తాళాలు జాగ్రత్తగా వేసుకోవాలని చూచించారు. కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఆర్థిక తోడ్పాటు


విభిన్న ప్రతిభావంతులను ఉద్దేశించి మాట్లాడుతున్న మెప్మా క్లస్టర్ ఆఫీసర్ రమాదేవి

నర్సీపట్నం : అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. మెప్మా క్లస్టర్ ఆఫీసర్ రమాదేవి మాట్లాడుతూ సంఘాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతిభావంతులు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరు చేయించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించడం జరుగుతుందన్నారు.

అడ్డూరు నాయుడుబాబు వర్ధంతి


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న స్పీకర్, ఎమ్మెల్యేలు

చోడవరం /చోడవరం రూరల్ : ప్రజలకు సేవచేయడమే ధ్యేయంగా నాయుడుబాబు పనిచేశారని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. అడ్డూరులో మాజీ సర్పంచ్ దివంగత నాగిరెడ్డి వెంకటరమణ (నాయుడుబాబు) విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కెఎస్ఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలను అందచేశారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

గొలుగొండ: అందరూ కలసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆయన మంగళవారం రూ.4.60 కోట్లతో పప్పుశెట్టిపాలెం – పీఎన్‌డీ పాలెం రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కలెక్టర్ విజయ్ కృష్ణన్, జడ్పీటీసీ గిరిబాబు, సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి


బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ దమయంతి

నర్సీపట్నం : స్థానిక శాఖ గ్రంథాలయంలో మాజీ రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని మంగళవారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి దమయంతి బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు, పాఠకులు పాల్గొన్నారు.

- తాండవ జలాశయంలో జాలర్ల పరిస్థితి దయనీయం
- పది రోజుల నుంచి వలలకు చిక్కని చేపలు

బోటు కదలక... పూట గడవక !


తాండవ జలాశయంలో వేట సాగిస్తున్న జాలర్లు


వేట లేక ఒడ్డుకు పరిమితం అయిన బోట్లు

గొలుగొండ : తాండవ జలాశయం జాలర్ల పరిస్థితి అధ్వానంగా మారింది. పది రోజుల నుంచి వేట సాగక ఇబ్బందులు పడుతున్నారు. తుపాను ప్రభావం కారణంగా జలాశయంలో గాలులు అధికంగా రావడం వల్ల వేట జరగలేదని జాలర్లు ఆవేదన చెందుతున్నారు. ఈ జలాశయంపై సుమారుగా 450 కుటుంబాలు ఆధారపడి ఉండడం వల్ల వేట జరగక పూట గడవక ఇబ్బందులు పడుతున్నట్టు చెబుతున్నారు.

పలుసార్లు ప్రమాద స్థాయికి..

తాండవ జలాశయం సుమారుగా నాలుగువేల ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈఏడాది అధిక వర్షాల కారణంగా జలాశయం పలు సార్లు ప్రమాద స్థాయి చేరింది. జలాశయం ప్రమాదస్థాయికి చేరిన ప్రతిసారి సాగునీటిని గేట్ల ద్వారా నీటిని బయటకు వదలడం జరిగేది. ఈ సమయంలో జాలర్లకు వేట చేయడానికి ఇబ్బందులు ఉండేవి. తాండవ జలాశయానికి ప్రధాన ఆధారం అయిన దారగెడ్డ, బొడ్డేరు గెడ్డల నుంచి వర్షం నీరు ప్రవహించి తాండవ జలాశయం చేరేది.

వాతావరణంలో మార్పులు

తుపాను ప్రభావం కారణంగా తాండవ జలాశయంలో చేపలు పట్టడం కష్టంగా మారుతుందని జాలర్లు తెలుపుతున్నారు. ఇప్పటికే నిండుకుండలా దర్శనమిస్తున్న తాండవ జలాశయంలో బోటు వేయడానికి జాలర్లు వణికిపోతున్నారు. తుపాను కారణంగా బోట్లు ఒడ్డుకు పరిమితం అవుతున్నాయి. చేపల కోసం బోట్లపై వెళ్లిన సమయంలో గాలుల కారణంగా వలలు చిక్కులు పడి నష్టపోతున్నామని, గాలులు అధికంగా రావడం వల్ల బోట్లు నడపలేకపోతున్నామని అంటున్నారు. అంతే కాకుండా నీరు అధికంగా ఉండడం వల్ల కూడా చేపలు వలలకు చిక్కడం లేదని చెబుతున్నారు.

450 మందికి ఆధారం..

తాండవ జలాశయం పరిసర ప్రాంతాల్లో వేట సాగించే జాలర్లు సుమారుగా 450 మంది వరకు ఉన్నారు. స్వదేశీ మత్స్యకారుల సొసైటీ ఆధ్వర్యంలో ఈ వేట సాగిస్తుంటారు. తాండవ జలాశయం పరిధిలో ఉన్న వెంకటాపురం, జాలరుపేట, పొగచెట్లపాలెం, గొలుగొండ, అమ్మపేట, గాదంపాలెం, విప్పలపాలెం, సాలికమల్లవరం తదితర గ్రామాల్లో జాలర్లు వేట సాగించడం జరుగుతుంది. ఈ సీజన్‌లో చేపల వేట సాగించి వచ్చిన డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. కానీ 10 రోజుల నుంచి వేట సాగక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు ఆవేదన చెందుతున్నారు.

పది రోజులుగా వేట లేదు..



తాండవ జలాశయంలో చేపల వేట సాగక ఇబ్బందులు పడుతున్నాం. జలాశయంలో అధికంగా నీరు ఉండడం వల్ల గాలుల ప్రభావానికి బోట్లు తిరగబడే అవకాశం ఉంది. అందుకే వేటకు వెళ్లడానికి సాహసం చేయడం లేదు. దీనివల్ల జాలర్ల పరిస్థితి అధ్వానంగా మారింది. వేట సాగక పూట గడవక నరకయాతన పడుతున్నాం. గాలుల ప్రభావం తగ్గే వరకు బోట్లు జలాశయంలోనికి తీసుకు వెళ్లలేం.

– అప్పారావు, జాలర్లు, వెంకటాపురం

రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు


చౌడువాడ ఎస్సీ కాలనీలో జరుగుతున్న డ్రైయినేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఎరుకునాయుడు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో రూ.2 కోట్ల 50లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో 19 అభివృద్ధి పనులు జరుగుతున్నట్టు సర్పంచ్ దాడి ఎరుకునాయుడు అన్నారు. గ్రామంలో గల ఎస్సీ కాలనీలో నిర్మాణంలో ఉన్న డ్రైయినేజీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో ప్రాధాన్యం ఉన్న ప్రాంతాల్లో మొదటి దశలో పనులను చేపట్టేందుకు నిధులు మంజూరైనట్టు తెలిపారు.ప్రస్తుతానికి 10 పనులు పూర్తికాగా మిగిలిన 9 పనులు జరుగుతున్నాయన్నారు. ఎస్సీ కాలనీలో డ్రైయినే పనులకు రూ.5లక్షల జిల్లా పరిషత్ నిధులు కుడా మంజూరైనట్టు తెలిపారు. డిసెంబర్ 15 నాటికి పనులు పూర్తవుతాయన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

తడిచిన పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి


సత్యవరంలో పొలంలో ఉప్పు ద్రావణం పిచికారీ చేయిస్తున్న దృశ్యం

మాడుగుల : తుపాను కారణంగా కోసిన వరి పనలపై ట్యాంకుకు 50 గ్రాములు కళ్లు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని, వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు అన్నారు. సోమవారం మండలంలో సత్యవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో మాట్లాడారు. ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయడం వల్ల ధాన్యం రంగు మారదని, మొలకరాదని అన్నారు. తడిచిన, కుప్పలుగా పెట్టిన ధాన్యం ఆరబెట్టాలన్నారు. కార్యక్రమంలో వరప్రసాద్, రైతు సేవా కేంద్రం సిబ్బంది గౌరునాయుడు, రైతులు పాల్గొన్నారు.

గొయ్యితో పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదాలు జరగకుండా గొయ్యిలో పెట్టిన కుండీలో మొక్క

నర్సీపట్నం : నర్సీపట్నం నుంచి విశాఖ వెళ్లే ప్రధాన రహదారికి మధ్యలో పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల సమీపంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ గొయ్యి ప్రమాదాలకు నిలయంగా మారింది. రాత్రి వేళల్లో గోతిలో పడి వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ప్రమాదాలు జరగకుండా చుట్టుపక్కల వారు కుండీలో మొక్కను తీసుకొచ్చి గొయ్యి మధ్యలో పెట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్ అండ్‌బీ అధికారులు గుంతలను పూడ్చారు. కానీ ప్రమాదానికి నిలయంగా మారిన గుంతను పూడ్చడం మరిచారు. ఈ రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. తక్షణం ఈ గొయ్యిని పూడ్చి ప్రమాదాలను ఆరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక పరికరాలు అందించాలి


అధికారులకు వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగుల సంఘం ప్రతినిధులు

చోడవరం : దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు మరింత చొరవ చూపాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు రవికుమార్ కోరారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చోడవరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సదరం సర్టిఫికెట్లు మంజూరులో వెసులుబాటు కల్పించాలని రవికుమార్ అన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో దివ్యాంగ వయో వృద్ధుల కార్యాలయంలో పూర్తి స్థాయి అధికారులను నియమించాలని, ఉపాధి పథకంలో దివ్యాంగుల బృందాలకు పని కల్పించాలని, వారికి ప్రత్యేక పరికరాలు అందించాలని, రూ.15వేలు పింఛన్‌లో మానసిక దివ్యాంగులను చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 41 మంది దివ్యాంగులకు బస్సు, రైలు పాస్‌లు అందజేశారు. సీఐ అప్పలరాజు, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీపీ కాసు, ఆర్క్ ప్రసాద్, ఈఓపీఆర్‌డీ మహేష్, ఆడమ్స్ పాల్గున్, ఘనిరెడ్డి, సర్పంచ్ నాగబాబు, అంధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లయ్య పాల్గొన్నారు.

డీఎల్‌డీవో ఆకస్మిక తనిఖీ


దేవరాపల్లి గురుకుల విద్యాలయంలో భోజనశాలలో తనిఖీ చేస్తున్న డీఎల్‌డీవో మంజులవాణి

దేవరాపల్లి : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం పెట్టాలని డీఎల్‌డీవో ఎం.మంజులవాణి అన్నారు. మండలంలోని తెనుగుపూడి బీఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని స్థానిక ఎంపీడీవో సువర్ణరాజుతో కలిసి మంగళవారం ఆమె తనిఖీ చేశారు. భోజనాలశాలను సందర్శించి భోజనాలను రుచి చూశారు. భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక గురుకులం ప్రిన్సిపాల్ పి. రఘు క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు జోన్ స్థాయిలో అద్భుతంగా రాణించి గోల్డ్, సిల్వర్ పతకాలతో పాటు ఓవరాల్ చాంఫియన్ సాధించారని డీఎల్‌డీవోకు వివరించడంతో వారిని అభినందించారు. క్రీడా మైదానం అభివృద్ధి చేసేందుకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. గురుకుల విద్యార్థుల వాడుక నీటి కోసం ఉపాధి హామీ పథకంలో తవ్విన ఇంకుడు గొయ్యిని ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఉపాధి ఏపీవో చంద్రకళ, టెక్నికల్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు ఉన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఏదీ?

కె.కోటపాడు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా రైతులకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సహాయం అందలేదని దాలివలస గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కశిరెడ్డి గౌరినాయుడు అన్నారు. దాలివలసలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ పూర్తయి రబీ ప్రారంభం అవుతున్నా రైతులకు అందించే పెట్టుబడి సహాయంపై కూటమి ప్రభుత్వం ప్రకటన చేయకపోవడం రైతులను మోసం చేయడమే అన్నారు.

కూటమి వైఫల్యాలు ఎండగట్టాలి

రోలుగుంట : వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. తాడేపల్లిలో రాష్ట్ర స్థాయిలో పార్టీ అధ్యక్షుడు నిర్వహించిన ఎంపీపీల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశ వివరాలను ఫోన్‌లో వివరించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలులో విఫలమైందన్నారు. ప్రభుత్వం వైఫల్యాలను పార్టీ నాయకులంతా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

దివ్యాంగ విద్యార్థికి రిటైర్డ్ ఎంఈవో వితరణ


విద్యార్థికి నగదు అందిస్తున్న అమృత్‌కుమార్

నాతవరం : ప్రత్యేక అవసరాలు గల పిల్లల నడుమ విశ్రాంత ఎంఈవో తాడి అమృత్‌కుమార్ జన్మదిన వేడుకలు జరుపుకోవడం వారిలో మనోధైర్యం నింపినట్టు అవుతుందని ఎంఈవో కామిరెడ్డి వరలహాల బాబు అన్నారు. మండల కేంద్రంలో గల పాఠశాలలో మంగళవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంచారు. తర్వాత ఈ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కుండల దివ్యశ్రీ అనే చిన్నారికి ఏడాది కాలంగా సాంకేతిక కారణాలతో ప్రభుత్వం నుంచి దివ్యాంగుల అలవెన్సు రాలేదు. ఆమెకు తాడి అమృత్‌కుమార్ సొంత డబ్బులు రూ.6వేలు నగదు అందచేశారు. పిల్లలందరికీ భోజనాలు వడ్డించారు. విద్యకు అవసరమైన సామాగ్రిని అందజేసారు. అనంతరం ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. హెచ్ఎం లోవకుమారి, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ కొండబాబు, మాజీ ఎంపీపీ జయకుమార్, ఐఆర్‌టీ ఉపాధ్యాయురాలు శివ లక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ కరక భారతి పాల్గొన్నారు.

వారాడలో విత్తనాల పంపిణీ


విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు : వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపే సూచనలు పాటిస్తూ మంచి దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. వారాడలో గల రైతు సేవా కేంద్రంలో మంగళవారం రాయితీపై రైతులకు వేరుశెనగ, మినుములు, పెసలు విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలో గల 16 రైతు సేవా కేంద్రాల్లో రైతులకు రబీకి 260 క్వింటాళ్ల వేరుశెనగ, 20 క్వింటాళ్ల పెసలు, 28 క్వింటాళ్ల మినుములు విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. వేరుశెనగ విత్తనాలకు రైతులు రూ.1728, మినుములకు రూ.364, పెసలకు రూ.392లను చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో గొర్రుపోటు వెంకటరావు, లెక్కల గోపి, మండల టీడీపీ అధ్యక్షుడు రొంగలి మహేష్, వ్యవసాయ విస్తరణాధికారి లైలాదేవి, కమలాకర్, అవతారం, పంచాయతీ కార్యదర్శి సరోజిని పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలు వినియోగించుకోండి


మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పారావు

మాడుగుల రూరల్ : ఆశ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధతో గ్రామాల్లో విధులు నిర్వహించాలని ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. ఆశ దినోత్సవం సందర్భంగా మంగళవారం కె.జె.పురం పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక శిబిరాల్లో అంగన్‌వాడీ చిన్నారుల పుట్టిన తేదీ, ఇతర తప్పొప్పుల సవరణ చేసుకునేలా చూడాలన్నారు. గ్రామాల్లో సారా సేవించడం వల్ల వచ్చే అనర్థాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ టి.వి.రాజారామ్, పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాదు, కమ్యూనిటీ హెల్త్ అధికారి సుజాత, సర్పంచ్ రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, పిహెచ్ఎన్ ఇందిర పాల్గొన్నారు.

మాడుగుల : అంగన్‌వాడీలో ఉంటున్న చిన్నారులకు కూడా ఆధార్ అప్‌డేట్ చేయాలని, ఎంపీపీ తాళ్లపురెడ్డి వేంకటరాజారామ్ అన్నారు. కింతలి పీహెచ్‌సీలో మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ అప్‌డేట్ చేయాలంటే ముందుగా క్యూఆర్‌కోడ్‌తో ఉన్న పుట్టిన తేదీ ధ్రువపత్రం ఉండాలన్నారు. మరో వారం రోజుల్లో అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి అప్‌డేట్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

కె.జె.పురం పీహెచ్‌సీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


కె.జె.పురం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ పేర్కొన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత కాలంగా కొరతగా వున్న మందులు, ఇంజక్షన్లు కొనుగోలు చేయాలని, సమావేశంలో తీర్మానించారు. సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితర సమావేశాల నిర్వహణకు, పేషెంట్లు వేచి వుండడానికి మీటింగ్ హాలు ఏర్పాటు చేయాలని, పీహెచ్‌సీ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఖాళీ స్థలంలో తుప్పలు డొంకలు తొలగించి, అందాన్ని ఇచ్చే మొక్కలు పెంచాలని తీర్మానించారు. సమావేశంలో ఎంపీడీవో కొంకి అప్పారావు మాట్లాడుతూ మందులు, ఇంజక్షన్లు కొరత లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు.

దివ్యాంగుల్లో ప్రతిభను గుర్తించాలి


మాకవరపాలెంలో బహుమతులు అందజేస్తున్న ఎంఈవో మూర్తి


కె.కోటపాడు : దివ్యాంగులకు బహుమతులను అందిస్తున్న ఎంఈవోలు


బహుమతులు అందిస్తున్న దృశ్యం


దేవరాపల్లిలో దివ్యాంగ బాలలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు పడాల్‌దాస్, ఉషారాణి


విజేత విద్యార్థులకు బహుమతుల ప్రదానం

మాకవరపాలెం : దివ్యాంగుల పట్ల అందరూ ఆప్యాయతతో మెలగాలని ఎంఈవో మూర్తి అన్నారు. స్థానిక భవిత కేంద్రం వద్ద మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల తల్లిదండ్రులు ఆత్మ స్థయిర్యంతో ముందుకు సాగాలన్నారు. అలాగే వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి పోత్సహించాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ఉషారాణి, మంగలక్ష్మిపాల్గొన్నారు.

కె.కోటపాడు : దివ్యాంగ విద్యార్థుల్లో మానసిక స్థయిర్యాన్ని కల్పించేలా వారి తల్లిదండ్రులు తోడ్పాటును అందించాలని ఎంఈవోలు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. భవిత కేంద్రాల్లో చిన్నారులకు సహిత విద్యతో పాటు ఫిజియోథెరపీ అందిస్తున్నట్టు సహిత విద్య ఉపాధ్యాయులు కన్నమ్మ, పరదేశి అన్నారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. హెచ్ఎం పద్మావతి, పీడీ లక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

గొలుగొండ: దివ్యాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో పోటీ పడి ముందుకు సాగాలని ఎంఈవో-1,2లు సత్యనారాయణ, ఏపీఎన్ఎస్ మూర్తి తెలిపారు. ప్రత్యేక అవసరాలు కల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. వివిధ క్రీడల్లో మంచి నైపుణ్యం కలిగిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

దేవరాపల్లి : దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా మెలగాలని మండల విద్యాశాఖ అధికారులు బి.పడాల్‌దాస్, వి.ఉషారాణి అన్నారు. భవిత కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. భవిత టీచర్లు శ్రీదేవి, గాయత్రి, శ్రీరాములు,ఎంపీపీ స్కూల్ హెచ్ఎం శ్రీనివాసులనాయుడు, కృష్ణస్వామినాయుడు, మనోహర్ పాల్గొన్నారు.

చోడవరం రూరల్ : విద్యా పరంగా దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి కె.సింహాచలం అన్నారు. మంగళవారం స్థానిక భవిత విద్యా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉపకార వేతనాల గురించి ప్రత్యేక ఉపాధ్యాయుడు వరప్రసాద్ వివరించారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం రామిరెడ్డి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వి.లక్ష్మి, ప్రత్యేక ఉపాధ్యాయులు కె.సత్యనారాయణ, పి.రమేష్ పాల్గొన్నారు.

బస్‌పాస్‌లకు దరఖాస్తులు

బుచ్చెయ్యపేట : వడ్డాది పాలసొసైటీ భవనంలో దివ్యాంగులకు బస్‌పాస్‌ల క్యాంపు నిర్వహించారు. 35 మంది దివ్యాంగులకు రాయితీపై సిటీ, రూరల్ బస్సుపాసుల దరఖాస్తులను అనకాపల్లి ఆర్టీసీ డిపో ఆర్‌టీ సిహెచ్. ధనలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముమ్మిడిశెట్టి కాశీబాబు, ఆర్టీసీ సిబ్బంది ప్రసాద్‌తో పాటు ఆకుల ఫౌండేషన్ చైర్మన్ ఆకుల నాగేశ్వరావు పాల్గొన్నారు. మూడేళ్ల కాలపరిమితితో సిటీలో ఉచితం, రూరల్ ప్రాంతంలో 50 శాతం రాయితీపై పాస్‌లు అందించడం జరుగుతుందని ఆర్టీసీ అధికారి ధనలక్ష్మి తెలిపారు.

ఉపాధి నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

చీడికాడ : తునివలసలో ఉపాధి హామీ నిధులు దుర్వినియోగంపై స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీడీవో హేమసుందరరావు మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామంలో 2022 నుంచి 2024 మధ్య గ్రామంలో జరిగిన ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగినట్టు మాజీ సర్పంచ్ పడాల అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆయన వెంట ఏపీవో గంగునాయుడు ఉన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 7వ తేదీన సుబ్రమణ్యస్వామి షష్టి సందర్భంగా పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు మంగళవారం సాయంత్రం తెలిపారు. ఉదయం నుంచి పంచామృత అభిషేకాలు, అనంతరం హోమం జరుగుతుందని పూజలో పాల్గొనే వారు 108 తమలపాకులు, తేనె, నెయ్యి, కొబ్బరికాయ, పండ్లు తదితర పూజా సామగ్రి తీసుకుని రావాలని, పూజల అనంతరం భక్తులకు అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.